# సాక్షి డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 21 । నవంబర్ । 2023




## రూ.1,40,661 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కల్లూరి భాస్కర పల్లయ్య శర్మ (హైదరాబాద్) సోమవారం రూ.1,40,661 విరాళం సమర్పించారు.



## తొలి వారం.. భక్తజన సాగరం

పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం.. అది కూడా ఈ మాసంలో మొట్టమొదటిది కావడంతో శివాలయాలు భక్తజన సాగరాలే అయ్యాయి. 8లో

## డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

## న్యూస్‌రీల్

### సకాలంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలు



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలనూ సకాలంలో చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ జిల్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అదనపు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎం.వెంకట రాజేష్ సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి జేసీ నుపూర్ అజయ్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులను నియమించి, సంబంధిత శిక్షణలు కూడా పూర్తి చేయాలని అన్నారు. సున్నిత పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన వివరాలు అందజేయాలన్నారు. గతంలో 90 శాతం పోలింగ్, అతి తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాల వివరాలు కూడా ఇవ్వాలని సూచించారు. నోడల్ అధికారులను నియమించి, మారుమూల ప్రాంతాల రవాణాకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లా, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలకు గతంలో అనుభవం ఉన్న అధికారులను ఎంపిక చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఫొటో ఓటరు గుర్తింపు కార్డులను ముద్రణకు పంపి, సకాలంలో పంపిణీ చేయాలని జేసీ ఆదేశించారు.

### కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉత్పన్నమవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బందిని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. వివిధ మండలాలు, నియోజకవర్గాల అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిల్లర్ లాగిన్, ట్రక్ జనరేషన్ జీపీఎస్ సిస్టం వంటివి సక్రమంగా అమలవుతున్నాయో లేదో పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. జియో ట్రాకింగ్ చేసిన మార్గాల్లోనే ధాన్యం తరలించాలని లేకుంటే సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలుంటాయని చెప్పారు. గ్రామాల్లో కమ్యూనిటీ నారుమళ్లు వేసే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని, నిర్దేశిత ఆయకట్టులో పూర్తి స్థాయిలో నాట్లు వేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫాం 6, 7, 8 పెండింగ్ ప్రక్రియను వెంటనే కచ్చితత్వంతో పూర్తి చేసి, ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ మాట్లాడుతూ, 20 సంవత్సరాలు పైబడిన అసైన్డ్ భూములపై సర్వ హక్కులూ కల్పిస్తూ పట్టాలు, ధ్రువపత్రాలు, లంక భూముల పట్టాలు, ఎస్సీ శ్మశాన వాటికలకు సంబంధించిన పట్టాలు, రీ సర్వే హక్కు పత్రాలు, స్వామిత్వ సర్వే బుక్‌లెట్లు, 90 రోజులకు ఇళ్ల స్థలం మంజూరు పట్టాల పంపిణీపై సమీక్షించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎల్‌డీఓ విజయదాస్, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు

మలికిపురం: మండలంలోని బట్టేలంక ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ నంద్యాలలో రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. వీటిల్లో ఈ పాఠశాలకు చెందిన కె.మృదులత వ్యక్తిగత ఎపీ (ఈపీఈఈ) విభాగంలో కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే అండర్–17 బాలికల ఫోయిల్ టీమ్ విభాగంలో సీహెచ్ రేష్మ, జి.కావ్యశ్రీ, కె.ప్రణతి బంగారు పతకాలు సాధించారు. అండర్–17 బాలుర విభాగంలో పి.జగదీష్‌వర్మ, ఎ.నవీన్ కూడా బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వీరిని పాఠశాల వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీఎస్ఎస్ హనుమంతరావు, ఉపాధ్యాయులు కడలి వెంకటేశ్వరరావు, గంటా మురళి, వ్యాయామోపాధ్యాయుడు కడలి నాగరాజు, పీఈటీ రాంబాబు తదితరులు అభినందించారు.

# నిన్న ఇరిగేషన్.. నేడు డ్రెయిన్స్

- జిల్లాలో కొలువుదీరిన ఈఈ కార్యాలయాలు
- ముమ్మిడివరం ఎయిమ్స్‌లో డ్రైనేజీ ఈఈ ఆఫీసు
- మొదలయిన కార్యకలాపాలు
- రైతులకు, స్థానిక అధికారులకు తీరిన ఇబ్బందులు



నూతన కార్యాలయంలో ఈఈ ఏడుకొండలుతో డ్రెయిన్స్ సమస్యలపై చర్చిస్తున్న ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు బాబీ, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు

సాక్షి, అమలాపురం: జిల్లా రైతులకు మరో మేలు చేసే దిశగా గొప్ప ముందడుగు పడింది. ఇప్పటికే ధవళేశ్వరంలో ఉన్న ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) కార్యాలయాన్ని అమలాపురం తరలించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. తాజాగా డ్రైనేజీ ఈఈ కార్యాలయాన్ని కూడా ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలో ఏర్పాటు చేసింది. తద్వారా కోనసీమ రైతులు దశాబ్దకాలం నుంచి కోరుతున్న కార్యాలయాల తరలింపు కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు.

**ఎంతో ప్రాధాన్యం**

ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీ భవనాల్లో డ్రైనేజీ ఈఈ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఉండే ఈ కార్యాలయం ఇప్పటి వరకూ కాకినాడలో ఉండేది. దీని పరిధిలో రామచంద్రపురం, అమలాపురం, రాజోలు సబ్ డివిజన్లు ఉన్నాయి. జిల్లాలో సుమారు 2,71,658 ఎకరాల ఆయకట్టు ఉండగా, దీనిలో సింహభాగం వరి, ఆక్వా సాగు జరుగుతోంది. గోదావరి డెల్టాలో నాలుగు అంచెల మురుగునీటి కాలువ వ్యవస్థ ఇక్కడ ఉంది. రెవెన్యూ, మైనర్, మీడియం, మేజర్ డ్రైనేజీ వ్యవస్థల కింద జిల్లాలో సుమారు 584 డ్రెయిన్లు 706.082 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఈ కాలువల్లో గుర్రపు డెక్క, తూడు వంటి వాటి తొలగింపు పనులు డ్రైనేజీ విభాగమే చేయాలి. అలాగే, ఆక్రమణల నుంచి కాపాడాలి. మురుగునీటి కాలువలకు అనుసంధానంగా ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు, కాలువలపై వంతెనలు, రివిట్‌మెంట్, రిటైనింగ్ వాల్స్ మరమ్మతులు, నిర్మాణాల వంటివి డ్రైనేజీ విభాగమే చేయాలి.

**అధికారుల తాత్సారానికి అడ్డుకట్ట**

ఇటీవల జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువల ద్వారా ముంపు నీరు దిగక వేలాది ఎకరాల్లో ఖరీఫ్ వరి చేలు నీట మునిగి, కోట్లాది రూపాయల పంట నష్టం జరగడం సర్వసాధారణంగా మారింది. ఈ నేపథ్యంలోనే తూర్పు, మధ్య డెల్టాల డ్రెయిన్స్ ఈఈ కార్యాలయాన్ని కోనసీమలో ఏర్పాటు చేయాలని ఇక్కడి రైతులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాన్ని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. ముఖ్యంగా అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ) దీని అవసరాన్ని సీఎం జగన్‌కు చెప్పడంతో పాటు పలుమార్లు ఉత్తర ప్రత్యుత్తరాలు చేశారు. ఈ నేపథ్యంలో ఈఈ కార్యాలయం తరలింపునకు సీఎం జగన్ అంగీకరించడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే భవనం అందుబాటులో లేదని కొన్నాళ్లు.. మౌలిక సదుపాయాలు లేవని మరి కొన్నాళ్లు అధికారులు తాత్సారం చేస్తూ వచ్చారు. దీనిపై ఇటీవల జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఎంపీ అనురాధ ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. స్వయంగా సీఎం జగన్ ఆదేశాలు జారీ చేసినా కార్యాలయం ఏర్పాటు ఎందుకు ఆలస్యమవుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కలెక్టర్ హిమాన్షు శుక్లాలు ఇరిగేషన్ అధికారులకు క్లాస్ తీసుకున్నారు. ఫలితంగా అధికారులు ఆగమేఘాల మీద ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీ భవనాల్లో ఈఈ కార్యాలయం ఏర్పాటు చేశారు.



ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలోని డ్రైనేజీ ఈఈ కార్యాలయం

**ఎంతో మేలు**

ఈ రెండు కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేయడం వలన ఆయకట్టు రైతులతో పాటు స్థానికంగా పని చేస్తున్న అధికారులకు సైతం మేలు జరగనుంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సుమారు రూ.1,700 కోట్లతో చేపట్టిన డెల్టా ఆధునికీకరణ పనులు ఆయన హఠాన్మరణంతో నిలిచిపోయాయి. దీంతో డెల్టాలో కాలువల వ్యవస్థ దెబ్బ తిని, ఖరీఫ్‌లో ముంపు, రబీలో నీటి ఎద్దడి ప్రధాన సమస్యగా మారింది. కానీ చిన్నచిన్న పనులకు అనుమతులు రావాలన్నా, అంచనాలు రూపొందించాలన్నా స్థానిక అధికారులు అటు ధవళేశ్వరం, ఇటు కాకినాడ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఈఈ కార్యాలయాలు రామచంద్రపురం, అమలాపురం, ముమ్మిడివరంలోనే అందుబాటులో ఉండటం వలన చాలా వరకు సమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకుంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**సీఎం జగన్ చిత్తశుద్ధి :** తరచూ పంట మునిగిపోవడంతో నష్టపోతున్నామనే ఆవేదనతో కోనసీమ రైతులు 2011లో సాగు సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వారు చేసిన డిమాండ్లలో కాకినాడలోని డ్రైనేజీ ఈఈ కార్యాలయాన్ని కోనసీమకు తీసుకురావాలనేది ఒకటి. దీంతో పాటు ధవళేశ్వరంలోని ఇరిగేషన్ మధ్య డెల్టా ఈఈ కార్యాలయాన్ని అమలాపురం, తూర్పు డెల్టా ఈఈ కార్యాలయాన్ని రామచంద్రపురం తరలించాలని డిమాండ్ చేశారు. నాటి ఉద్యమానికి ప్రతిపక్ష అధినేతల హోదాలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుగా నిలిచారు. తాము అధికారంలోకి వస్తే సాగు సమ్మె చేస్తున్న రైతుల డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు.. ఈ హామీని షరా మామూలుగానే గాలికి వదిలేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయాన్ని రెండేళ్ల క్రితమే అమలాపురం శివారు రంగాపురంలో, తూర్పు డెల్టా ఈఈ కార్యాలయాన్ని రామచంద్రపురంలో ఏర్పాటు చేశారు. తాజాగా డ్రైనేజీ ఈఈ కార్యాలయాన్ని కూడా ముమ్మిడివరంలో ఏర్పాటు చేయడం విశేషం. తద్వారా తమ డిమాండ్లను నెరవేర్చటంలో సీఎం జగన్ చిత్తశుద్ధి చూపించారని జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పని చేస్తాం**

**రైతులకు మేలు చేయాలనే ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా డ్రైనేజీ విభాగం పని చేస్తుందని ఆ శాఖ ఈఈ ఏడుకొండలు తెలిపారు. ఏపీ స్టేట్** అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు(బాబీ)తో కలిసి ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలో డ్రైనేజీ ఈఈ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, ఈ కార్యాలయం కోనసీమ రావడం వల్ల ఇక్కడ ఉన్న డ్రెయిన్స్‌పై నిఘా పెరుగుతుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు వేగంగా తెలుసుకునే అవకాశముంటుందన్నారు. బాబీ మాట్లాడుతూ, సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో ఈ కార్యాలయం కాకినాడ నుంచి ముమ్మిడివరం వచ్చిందన్నారు. కోనసీమ రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ కార్యాలయం తరలింపు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డీఈఈలు నాగార్జున, కిషోర్, నాగేంద్రకుమార్, ఏఈలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్పందనకు 218 అర్జీలు



స్పందనలో అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా


అమలాపురం రూరల్: కలెక్టరేట్ గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమానికి 218 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయి అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన వినతులపై క్షేత్ర స్థాయిలో పూర్తిగా విచారణ జరిపి, అర్జీదారు సంతృప్తే ధ్యేయంగా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం 1902 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసిందని, ప్రతి వినతీ పరిష్కారమయ్యే వరకూ అంచెలంచెలుగా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతోందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### పోలీస్ 'జగనన్నకు చెబుదాం'కు 23 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 23 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో విన్నవించుకున్నారు. ఎక్కువగా కుటుంబ, ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే వచ్చాయి. కొన్ని అర్జీలపై ఎస్పీ అక్కడికక్కడే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన వనచర్ల జవ్వమ్మ తన భర్త అదృశ్యమయ్యాడని, అతడి ఆచూకీ కనిపెట్టాలని విలపిస్తూ ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న ఆకాశం

- నింగిలో మబ్బులు.. అక్కడక్కడ జల్లులు
- తుపాను వాతావరణంతో రైతుల్లో గుబులు
- పంటను కాపాడుకునేందుకు ఉరుకులు.. పరుగులు
- హడావుడిగా వరి కోతలు



మేఘావృతమైన ఆకాశం




వాతావరణ ప్రభావంతో పెదపళ్లలో ధాన్యాన్ని వడివడిగా ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

ఆలమూరు: సాగునీరు పుష్కలంగా అందించడం.. తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం.. పెద్దగా వర్షాలు కురవకపోయినా వాతావరణం అనుకూలించడం వంటి కారణాలతో ఈ ఏడాది ఖరీఫ్ పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం కూడా సరైన గిట్టుబాటు ధర కల్పిస్తోంది. గడచిన కొన్ని సంవత్సరాలుగా ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న అన్నదాతలకు ఈ ఖరీఫ్ ఆశాజనకంగా కనిపించింది. దీంతో రైతులందరూ ఆనందంగా ఉన్నారు. ఈ ఏడాది నవంబరు తుపానుల గండం దాటిపోతున్నామనుకుంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సరిగ్గా ఇదే సమయంలో వాతావరణంలో హఠాత్తుగా సంభవించిన మార్పులు వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం నింగిలో కమ్ముకున్న మబ్బులు.. చెదురుమదురుగా కురుస్తున్న చిరుజల్లులు అన్నదాతలను హడలెత్తిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ ముఖం చాటేసిన వర్షాలు.. ఇప్పుడు కీలకమైన వరి కోతల సమయంలో కురుస్తాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. తుపాను వాతావరణంతో కలవరపడుతున్న రైతులు.. పంటను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. రామచంద్రపురం, కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ సుమారు 70 శాతం మేర వరి కోతలు పూర్తయ్యాయి. అమలాపురం, రాజోలు, ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమవుతున్నాయి. కొంత మంది రైతులు రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన బొండాలు విత్తన ధాన్యాన్ని ఇప్పటికే మాసూళ్లు చేసుకుని నిల్వ చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 4.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్నది వ్యవసాయ శాఖ అంచనా. ఇప్పటి వరకూ 32,619 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 7,421 ఎకరాల్లో వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన 1.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. మిగిలిన ధాన్యం కళ్లాల్లో, పొలాల్లోని పనల మీద ఉంది. ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి, సంరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా గట్టెక్కవచ్చనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో రెండుమూడు రోజుల పాటు రైతులు వేచి చూసి, ఆపై అనుకూల వాతావరణం ఏర్పడ్డాక ముందుకు సాగాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.


### జీపీఎస్ వాహనాలపై మినహాయింపు కావాలి



వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మాసూళ్లు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైసు మిల్లులకు తరలించేందుకు వీలుగా ట్రాక్టర్లకు జీపీఎస్ విధానంలో మినహాయింపు ఇవ్వాలి. దీనివల్ల కళ్లాల్లో ఉన్న ధాన్యం మిల్లులకు చేరడంతో పాటు, సకాలంలో పంట సొమ్ము చేతికొస్తుంది.

– పోలాబత్తుల నాగేశ్వరరావు, రైతు, మినపల్లి

### కోతలు వాయిదా వేసుకోవాలి



వాతావరణ పరిస్థితులపై ఆందోళన వద్దు. అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ శాఖ సూచనలతో వరి కోతలు మరో రెండు రోజుల పాటు వాయిదా వేయాలి. కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు చేరవేయాలి. లేకుంటే పరిశుభ్రమైన వాతావరణంలో బరకాలు కప్పి, ధాన్యాన్ని సంరక్షించుకోవాలి.

– ఓలేటి బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి, అమలాపురం

# గంగపుత్రులకు భరోసా

- లబ్ధిదారుల ఖాతాల్లోకి ఓఎన్‌జీసీ పరిహారం
- నేడు జమ చేయనున్న సీఎం జగన్
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 23,458 మందికి మేలు
- రూ.161.86 కోట్ల మేర లబ్ధి



మత్స్యకార భరోసా వేడుకలు జయప్రదం చేయాలని ప్రజలను కోరుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

తాళ్లరేవు: సముద్రంలో చేపల వేట పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు పరిహారం రూపంలో భరోసా దక్కనుంది. గౌతమీ గోదావరి ముఖద్వారంలో ఓఎన్‌జీసీ డ్రెడ్జింగ్, పైప్‌లైన్ నిర్మాణ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నష్టపోతున్న మత్స్యకారులకు ఆ సంస్థ ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం పరిహారం అందించనుంది. ఈ మేరకు తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో నిర్వహించే మత్స్యకార భరోసా కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ ద్వారా ఓఎన్‌జీసీ పరిహారాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

చమురు అన్వేషణ కార్యకలాపాల కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు నెలలో 25 రోజులకు గాను రోజుకు రూ.460 చొప్పున నెలకు రూ.11,500 మేర ఓఎన్‌జీసీ పరిహారం చెల్లించనుంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్, మత్స్య, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఓఎన్‌జీసీ అధికారులు అంగీకరించారు. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారుల ద్వారా 2020 నవంబర్‌లో గ్రామ, మండల స్థాయి కమిటీలు వేసి 18 నుంచి 65 ఏళ్ల వయస్సు కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ విధంగా కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 23,458 మందిని లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో 16,408 మంది కోనసీమ, 7,050 మంది కాకినాడ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. వీరికి ఇప్పటికే ప్రతి నాలుగు నెలలకోసారి రూ.107,90,68,00 చొప్పున మూడు విడతల్లో రూ.323,72,04,000 జమ చేశారు. ఇప్పుడు ఆరు నెలల కాలానికి సంబంధించి నాలుగో విడతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.161,86,02,000 నగదు జమ చేయనున్నారు.

**నేడు కోరంగిలో మత్స్యకార భరోసా వేడుకలు**

తాళ్లరేవు మండలం కోరంగి దుర్గా మల్లేశ్వర ఆలయ సమీపాన మత్స్యకార భరోసా వేడుకలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యాన భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులు, ప్రజలకు ఎమ్మెల్యే పొన్నాడ విజ్ఞప్తి చేశారు.

## కవులు, కళాకారులకు రేపు అవార్డుల ప్రదానం

అంబాజీపేట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా కళా రంగంలో ప్రతిభ కలిగి, ఆర్థికంగా వెనుకబడిన వారికి అరిగెల బలరామమూర్తి సాహితీ, కళాపీఠం ఆధ్వర్యాన అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఆ కళాపీఠం వ్యవస్థాపకుడు అరిగెల బలరామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కొర్లపాటివారిపాలెం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అవార్డుల ప్రదానోత్సవంలో సినీ రచయిత పడాల శివసుబ్రహ్మణ్యం, కళాకారులు, రచయితలు పాల్గొంటారని, అనంతరం జాతీయ తైక్వాండో పోటీల్లో విజయం సాధించిన వారిని సత్కరిస్తామని బలరామమూర్తి వివరించారు.


ద్రాక్షారామ: భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


ద్రాక్షారామ: భీమేశ్వరాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


సామర్లకోట: పంచారామ క్షేత్రంలో భీమేశ్వరునికి వేకువన తొలి పూజను తిలకించడానికి తరలి వచ్చిన భక్తులు


సామర్లకోట: భీమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

## తొలి వారం.. భక్తజన సాగరం

పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం.. అది కూడా ఈ మాసంలో మొట్టమొదటిది కావడంతో శివాలయాలు భక్తజన సాగరాలే అయ్యాయి. పావన గోదావరి పాయలు.. ఆ నదీ కాలువలు.. ఆలయ పుష్కరిణులు.. ఇతర నదీతీరాల్లో వేలాదిగా భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి.. ఆ ముక్కంటిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్షబిల్వార్చనలు, ఆవునేతి వత్తులతో దీపారాధనలు ఆచరించారు. తమను చల్లగా కాపాడాలని, శుభాలనొసగాలని వేడుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రాలైన ద్రాక్షారామ, సామర్లకోట, పిఠాపురం పాదగయ, మురమళ్ల తదితర ఆలయాలకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– రామచంద్రపురం రూరల్/సామర్లకోట/పిఠాపురం/ ఐ.పోలవరం/కొత్తపేట/రాజమహేంద్రవరం


రాజమహేంద్రవరం: పుష్కరాల రేవు వద్ద గోదావరి పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు. (అంతర చిత్రం) గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు


మురమళ్ల: భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితుడు


కొత్తపేట: పలివెల కొప్పేశ్వరస్వామి వారికి అర్చకుల అభిషేకం

## ఈ మేక ధర.. కేకో కేక



ఒళ్లంతా విపరీతంగా పెరిగిపోయిన ఊలుతో కనిపిస్తున్న దీనిని పొట్టేలు అనుకునేరు! ఇదో మేక.. అలాగని ఇది ఆషామాషీ మేక కాదు.. దీని రేటు వింటే కళ్లు తేలవేయడం ఖాయం. మామూలుగా మన దేశవాళీ మేక ఖరీదు మహా అయితే ఓ ఇరవై వేల రూపాయలుంటుంది. కానీ ఈ మేక రేటు ఏకంగా ఒకటిన్నర లక్షలు. 'చిగు' జాతికి చెందిన ఈ మేకలు హిమాలయ పర్వత ప్రదేశాల్లో ఉత్తర ప్రదేశ్‌కు ఉత్తరంగా, హిమాచల్ ప్రదేశ్‌కు ఈశాన్యంగా లభిస్తుంటాయి. ఎక్కువగా తెలుపు రంగులో, వంపులు తిరిగిన పెద్ద పెద్ద కొమ్ములు కలిగి, సుమారు 50 కేజీల బరువు ఉంటాయి. హిమాలయాల్లో చలి ఎక్కువగా ఉండటంతో వీటి శరీరంపై ఊలు చాలా పొడవుగా పెరుగుతుంది. దీనిని శాలువాల తయారీకి వినియోగిస్తారు. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావుకు పశు పోషణ అంటే ఎంతో ఇష్టం. పుంగనూరు ఆవులు, గిత్తలు, విభిన్నంగా ఉండే మేకలు, చెవుల పిల్లుల వంటి వాటిని పెంచుతూ కొన్నాళ్ల తర్వాత లాభానికి విక్రయిస్తుంటారు. ఆయన ఈ మేకను నేపాల్‌లో రూ.1.50 లక్షలకు కొనుగోలు చేశాడు. మాచవరంలో జరిగిన పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వెంకటేశ్వరరావు వద్ద ఉన్న పుంగనూరు ఆవు, దూడను తీసుకువచ్చారు. వీటితో పాటు ఆయన ఈ 'చిగు' జాతి మేకను కూడా అక్కడకు తీసుకువచ్చారు. వింతగా ఉన్న ఈ మేకను పలువురు ఆసక్తిగా తిలకించారు.

– అంబాజీపేట


పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పిఠాపురం: పాదగయ క్షేత్రం పుష్కరిణిలో భక్తుల సందడి


పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అర్చకుల అభిషేకాలు

## ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 30 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులందరూ జరిమానా లేకుండా ఈ నెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చు. ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్‌వీఎల్ నరసింహం సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు వారి కళాశాలలో ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి ఎంత మంది ఫీజు చెల్లించారు, ఎందరు చెల్లించలేదు, కారణాలేమిటనే వివరాలను తమ కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపించాలని ఆదేశించారు. ఫెయిలైన విద్యార్థులందరితో ఫీజు కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ పాసైన తరువాత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ అన్ని కళాశాలల్లో అవగాహన కల్పిస్తోందని తెలిపారు. దీనిపై కూడా విద్యార్థులను ప్రిన్సిపాల్స్ ప్రోత్సహించి, ఎక్కువ మంది పేర్లు నమోదు చేయించి, వచ్చే నెలలో జరిగే పరీక్షకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌కు, పరీక్ష రాసేందుకు ఎటువంటి ఫీజూ లేదన్నారు. వచ్చే నెలలో పరీక్ష జరిగే తేదీ త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్ టీమ్ సభ్యుడు సాయికిరణ్‌ను 96429 73350 సెల్ నంబరులో సంప్రదించాలని నరసింహం సూచించారు.



# సత్యదేవుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- క్యూ కంపార్ట్‌మెంట్ల స్థానంలో మళ్లీ క్యూ లైన్లు
- పశ్చిమ రాజగోపురం వద్దకే దేవస్థానం బస్సులు
- విశ్రాంతి మండపం ముందు భాగంలో వ్రతాలు, ప్రసాదం కౌంటర్లు
- నూతన ఈఓ రామచంద్ర మోహన్ చర్యలు


పశ్చిమ రాజగోపురం వద్దకు దేవస్థానం వాహనాల్లో వస్తున్న భక్తులు


కంపార్ట్‌మెంట్లకు బదులు ఏర్పాటు చేసిన క్యూ లైన్లు


రామాలయం వద్ద గల విశ్రాంతి మండపంలో సేద తీరుతున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అన్నవరం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె.రామచంద్ర మోహన్ సోమవారం చర్యలు చేపట్టారు. సత్యదేవుని దర్శనానికి ఆదివారం వచ్చిన భక్తులు క్యూ కంపార్ట్‌మెంట్లలో చాలా ఇబ్బందులు పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆ కంపార్ట్‌మెంట్లను తాత్కాలికంగా మూసివేశారు. వాటి పక్కనే ఉన్న క్యూ లైన్ల ద్వారా దర్శనానికి వెళ్లే విధానాన్ని పునరుద్ధరించారు. దీంతో సోమవారం ఎటువంటి తొక్కిసలాటా లేకుండానే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- ఇప్పటి వరకూ భక్తుల వాహనాలను సత్యగిరి జంక్షన్‌లో నిలుపు చేసి భక్తులను దించి, వాహనాలను నేరుగా సత్యగిరిపై పార్కింగ్ స్థలానికి పంపించేవారు. దీనివలన సత్యగిరి జంక్షన్ నుంచి భక్తులు ఆలయానికి నడిచి రావాల్సి వచ్చేది. దేవస్థానం బస్సులు, దేవస్థానం నడుపుతున్న ఉచిత టాటా మ్యాజిక్ వాహనాల్లో కూడా వై.జంక్షన్ వరకూ మాత్రమే భక్తులను తీసుకుని వచ్చేవారు. దీనివలన భక్తులు ఇబ్బంది పడుతున్నారని ఈఓ రామచంద్ర మోహన్ గుర్తించారు. దీంతో దేవస్థానం బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాల్లో భక్తులను నేరుగా పశ్చిమ రాజగోపురం వరకూ తీసుకు రావాలని ఆదేశించారు.
- పశ్చిమ రాజగోపురం ఎదుట విశ్రాంతి షెడ్డు ముందు భాగంలో ప్రసాదం, వ్రతాల కౌంటర్ల ఏర్పాటుకు ఈఓ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ వీటిని షెడ్డు లోపల చివరన ఏర్పాటు చేశారు. భక్తులు అక్కడి వరకూ వెళ్లి, వ్రతాల టిక్కెట్లు, ప్రసాదం కొనుగోలు చేసేందుకు చాలా అవస్థలు పడేవారు. దీంతో వీటిని పశ్చిమ రాజగోపురం ముందు భాగంలో ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు.
- విశ్రాంతి షెడ్డు ముందు భాగంలో మెరకను తొలగించాలని సూచించారు.
- రామాలయం వద్ద విశ్రాంతి షెడ్డు చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించి, అక్కడ గతంలో మాదిరిగానే భక్తులు విశ్రాంతి తీసుకునే వీలు కల్పించారు.

### భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం



సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం ఇస్తాం. భక్తులు సులభంగా స్వామివారి వ్రతాలాచరించి, దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. దేవస్థానం వాహనాల్లో భక్తులు నేరుగా పశ్చిమ రాజగోపురం వరకూ చేరుకునే వీలు కల్పించాం. క్యూ లైన్లను పాత పద్ధతిలోనే ఏర్పాటు చేశాం. ఈఓ కార్యాలయం ముందు పార్కింగ్ స్థలంలో గతంలో 20 టాయిలెట్లు ఉండేవి. వాటిని కూల్చేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అక్కడ మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం



## ఆధ్యాత్మిక గీతం ఆవిష్కరణ


ఆధ్యాత్మిక గీతాన్ని విడుదల చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో కృష్ణ ధర్మ రక్షణ, జై బజరంగ్ సంయుక్త ఆధ్వర్యాన 9 బుధవారాలు – స్వామి వరాలు (9 బుధవారాల దీక్ష – ప్రచార యాత్ర) ప్రచారంపై ప్రత్యేక ఆధ్యాత్మిక గీతాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సోమవారం విడుదల చేశారు. స్వామివారి మహాత్మ్యాన్ని వివరించే ఈ గీతాన్ని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ రచించారు. దీనికి సింధూ కె.ప్రసాద్ సంగీతాన్ని స్వరపరిచారు. పర్యవేక్షణ కేడీఆర్ వహించగా, సహకారం నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ అందించారు. తొలుత గ్రామంలో స్వామివారి చిత్రపటంతో, స్వామివారి నామ నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ, కృష్ణ ధర్మ రక్షణ అధ్యక్షుడు కేడీఆర్, రామసేతు భక్త బృందం, జై బజరంగ్ సభ్యులు పాల్గొన్నారు.

## గోల్డెన్ వరల్డ్ కప్


సాయి తయారు చేసిన గోల్డెన్ వరల్డ్ కప్

పెద్దాపురం పట్టణానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, బంగారు శిల్పి తాళాబత్తుల సాయి సూక్ష్మ బంగారు వరల్డ్ కప్ తయారు చేశారు. కేవలం రెండు గంటల్లో 0.500 మిల్లీగ్రాముల బంగారంతో ఈ గోల్డెన్ వరల్డ్ కప్‌ను రూపొందించారు. ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో వరుసగా పది మ్యాచ్‌ల్లో అవలీలగా విజయం సాధించి,



అభిమానుల మనసును గెలుచుకున్న టీమిండియాకు, ప్రపంచ కప్ గెలుచుకున్న ఆస్ట్రేలియా జట్టుకు అభినందనలు తెలుపుతూ ఈ బంగారు ప్రపంచ కప్ తయారు చేశానని సాయి చెప్పారు.

– పెద్దాపురం

# స్వల్ప వ్యవధిలో చోరీ సొత్తు రికవరీ


కేసు వివరాలను విలేకరులకు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

రామచంద్రపురం: ఈ నెల 15న వృద్ధురాలిని బెదిరించి, చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు స్వల్ప వ్యవధిలోనే గుర్తించి, సొత్తు రికవరీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాజులూరు మండలం కోలంక గ్రామానికి చెందిన వృద్ధురాలు బూరెల శేషారత్నం ఈ నెల 15న యానాం ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేందుకు యానాం స్టేట్ బ్యాంకు వద్ద ఆటో కోసం వేచి ఉంది. అదే సమయంలో ఊరూ పేరూ తెలియని ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి, పరిచయం చేసుకున్నాడు. తాను ద్రాక్షారామ వైపు వెళ్తున్నానని, దారిలో కోలంక వద్ద దింపుతానని నమ్మబలికి, తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. తరువాత ద్రాక్షారామ వైపు కాకుండా ఇంజరం వైపు ఏటిగట్టు దారిలో తీసుకుని వెళ్లడంతో శేషారత్నం అభ్యంతరం తెలిపింది. అయితే దగ్గరలో తమ పొలం ఉందని, కూలీలకు సొమ్ములు చెల్లించి వెళ్లిపోదామని అతడు నమ్మబలికాడు. కె.గంగవరం మండలం వాసాలరేవు గోదావరి వద్ద శ్మశాన వాటిక పక్కన ఎవ్వరూ లేనిచోట బైక్ ఆపాడు. ఒంటి మీద బంగారం ఇవ్వకపోతే చంపుతానంటూ శేషారత్నాన్ని బెదిరించాడు. దీంతో ఆ వృద్ధురాలు భయపడి తన మెడలోని సుమారు రెండు కాసుల బంగారు చైను, రెండు గాజులు, ఉంగరం అతడికి ఇచ్చేసింది. అనంతరం నిందితుడు ఆమెను పక్కకే నెట్టివేసి మోటార్ సైకిల్‌పై అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయాడు. జరిగిన విషయాన్ని శేషారత్నం తన కుమారుడికి తెలియజేసింది. అనంతరం వారు పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఈ కేసు విచారణకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చారు. దీంతో రామచంద్రపురం డీఎస్పీ ఆధ్వర్యాన రామచంద్రపురం సీఐ వి.దుర్గారావు, పామర్రు ఎస్సై ఎస్‌కే జానీబాషా, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.ఈశ్వరరావు, కానిస్టేబుల్ కె.లోవరాజు, కె.సతీష్, టీవీ లక్ష్మణ్‌బాబు, కామేశ్వరరావులతో రెండు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు. యానాం కనకాలపేటకు చెందిన కనకాల వెంకటేశ్వర్లు ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. అతడిని సోమవారం అరెస్టు చేసి, చోరీకి గురైన బంగారు వస్తువులు రికవరీ చేశారు. రిమాండు నిమిత్తం నిందితుడిని రామచంద్రపురం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. కేసును స్వల్ప వ్యవధిలో చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు, ఎస్సై జానీబాషా, సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

తాళ్లరేవు: కాకినాడ – యానాం రహదారిలో జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కొప్పాడి దుర్గా ప్రసాద్ (34) అనుమానాస్పదంగా మృతి చెందాడు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. యానాం కురసాంపేట గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా మరో ద్విచక్ర వాహనం వస్తోంది. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అధిక రక్తస్రావమైన దుర్గా ప్రసాద్‌కు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దుర్గా ప్రసాద్ మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

## రైతుకు లబ్ధి చేకూరేలా కొబ్బరి కొనుగోళ్లు


ఏపీ ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సుధాకరరావు

అంబాజీపేట: నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యల నేపథ్యంలో రైతులకు పూర్తి న్యాయం జరిగేలా ఇక నుంచి కొబ్బరి కొనుగోళ్లు చేస్తామని ఏపీ ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ యు.సుధాకరరావు చెప్పారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సెప్టెంబర్ 16న ప్రారంభమైన నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రంలో ఇంత వరకూ సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు నిర్వహించామన్నారు. ఇకపై రైతులకు పూర్తి న్యాయం చేసేందుకు ఎన్సిడెక్స్ ఈ-మార్కెట్ లిమిటెడ్ (ఎన్‌ఈఎంఎల్) ఈ-సమృద్ధి యాప్ ద్వారా కొబ్బరి కొనుగోళ్లు చేస్తారని తెలిపారు. వచ్చే నెలాఖరుకు నాఫెడ్ ద్వారా 42,500 క్వింటాళ్ల కొబ్బరి కొనుగోలు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 600 క్వింటాళ్ల కొబ్బరి కొనుగోలు చేశామని చెప్పారు. వచ్చే నెలాఖరు వరకూ క్వింటాల్ మిల్లింగ్ కోప్రా రూ.10,860కు, బాల్ కోప్రా రూ.11,750కు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. జనవరిలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నూతన ధరల ప్రకారం కొబ్బరి కొనుగోలు చేస్తామన్నారు. కొబ్బరి తోటల ఈ-క్రాపింగ్ జరగకపోయినప్పటికీ రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసిన వివరాల ప్రకారం రైతులకు న్యాయం జరిగేలా పూర్తి స్థాయిలో కొబ్బరి కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు ఆయా ప్రాంతాల్లోని ఆర్బీకేలలో మిల్లింగ్ కోప్రా వివరాలు నమోదు చేయించుకున్న అనంతరం అంబాజీపేట కొబ్బరి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తామని సుధాకరరావు తెలిపారు.